క్లుప్తంగా

పోలీసు శాఖ గౌరవం పెంచేలా పని చేయాలి



పదోన్నతి స్టార్‌ను తొడుగుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీసు శాఖ గౌరవం పెంచేలా పని చేయాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఆర్ ఎస్సైగా పదోన్నతి పొందిన సయ్యద్ తకీద్దీన్‌కు పదోన్నతి సింహం స్టార్‌ను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ తకుద్దీన్ ఏఆర్ ఎస్సైగా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీంరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి గెస్ట్ లెక్చరర్ల వినతి



వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ లెక్చరర్లు

జగిత్యాలటౌన్: ఆటో రెన్యువల్ కం కన్సాలిడేటెడ్ పే అమలు చేయాలని కోరుతూ ఎస్‌కేఎన్ఆర్ కళాశాల గెస్ట్ లెక్చరర్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని జగిత్యాల పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ విజ్ఞప్తిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు లెక్చరర్లు తెలిపారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు చిలుక సుప్రియ, నీరటి దివ్యరాణి, కవిత, స్వప్న, రజిత, ప్రతిభ, స్వరూప, ప్రమోద్, వేణు, సత్తయ్య, శ్రీనివాస్, రాహుల్, గణపతి పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీ



రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం కోనరావుపేటలో ఓ రైస్‌మిల్లును ఆర్డీవో శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడిషనల్ కలెక్టర్ లత ఆదేశాలతో సోమవారం రైస్‌మిల్లును తనిఖీ చేసిన ఆర్డీవో పలు విషయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్ ధాన్యం నిల్వలపై ఆరా తీశారు. అలాగే రికార్డుల నిర్వహణ గురించి అడిగారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు స్థల పరిశీలన

మల్లాపూర్: మండల కేంద్రం శివారులో నవోదయ పాఠశాల నిర్మాణం కోసం సోమవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ స్థలం పరిశీలించారు. జగిత్యాల జిల్లాకు కేంద్రం నవోదయ పాఠశాలను మంజూరు చేయడంతో అధికారులు జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో అనువైన స్థలాలను పరిశీలిస్తున్నారు. మొగిలిపేట మార్గంలోని ఉసికె బిలుకు వద్ద సుమారు 25 ఎకరాల స్థలాన్ని స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై అధికారుల సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్

వెల్గటూర్ : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లపై సోమవారం తహసీల్దార్ శేఖర్ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా కోటిలింగాలకు పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఆలయ ఈవో కాంతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణం



కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట శివారులోని బ్రహ్మదేవుని గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ కల్యాణ మహోత్సవం



రాయికల్: పట్టణంలోని లలితాంబిక ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాజరాజేశ్వరీ కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు కల్యాణం తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లలితాంబిక శక్తిపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నందీలింగేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠాపన



ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి గ్రామశివారులోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నందీలింగేశ్వరుల విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠాపించారు. ముందుగా గోదావరి నుంచి గంగజాలలను ఊరేగింపుగా తీసుకవచ్చి నందీలింగేశ్వరులకు అభిషేకం చేసి, హోమయాగ పూజను నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో విగ్రహదాత నిరేటి శంకర్, లతిక, ఆలయ కమిటీ అధ్యక్షుడు నిరేటి రత్నం, మాజీ ఎంపీపీ దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకనకసోమేశ్వర స్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్: శ్రీ కనకసోమేశ్వర స్వామి జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, వీడీసీ చైర్మన్ సంగ గంగరాజం, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, శివదీక్ష స్వాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



పైడిమడుగులో కేక్ కట్ చేస్తున్న మహిళలు, ఎమ్మెల్యే సంజయ్



ధర్మపురిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/ధర్మపురి/మల్లాపూర్/మల్యాల/కథలాపూర్/పెగడపల్లి/ మెట్‌పల్లి/మేడిపల్లి/వెల్గటూర్/బుగ్గారం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సంజయ్ రక్తదానం చేశారు. పలు చోట్ల కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వరదకాలువలో కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



ఇళ్ల కొలతలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించినట్లు ఎంపీడీవో రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని కండ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

కోరుట్ల రూరల్: మండలంలోని సర్పరాజ్‌పూర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీరాజ్ ఏఈ సుచరిత్ సోమవారం మార్కవుట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, కార్యదర్శి మాదవి,పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఎర్రాపూర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. సోమవారం 3 ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో చంద్రశేఖర్ లబ్ధిదారులతో భూమి పూజ చేయించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణపనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. కార్యదర్శి మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండలాధికారులు సోమవారం భూమిపూజ చేశారు. సోమవారం ఇద్దరి లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్, ఏఈ జగదీశ్వర్, కార్యదర్శి సులోచన, నరేశ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడిపల్లి: భీమారం హైస్కూల్ విద్యార్థులు అంతడుపుల శ్రీహర్ష, కొత్తపల్లి హర్షవర్ధన్, ఆడ క్రిష్ణ, గుండేటి ప్రణీత్, జిల్లా మణి అమృత్, తొట్ల రిషి వర్ధన్, పుప్పాల రఘువీర్‌లు సబ్ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు భీమారం హెచ్ఎం జవ్వాజి అశోక్ తెలిపారు. హైదరాబాద్‌లో త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాదుల ప్రసాద్, నరుకుల శ్రీదర్, నజీమా, సాహేబా, ఎండి అప్సర్, కొప్పుల నరేందర్, కొక్కుల జయశ్రీ, నాగమల్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

రాయికల్: సిరిసిల్ల పట్టణంలో స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ పోటీలో రాయికల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. స్పార్క్ విభాగంలో రాయికల్ పట్టణానికి చెందిన పడకంటి జాహ్నవి, కుంబోజి దినేశ్, యశోద సాహిత్య, కండ్లపల్లి శశాంక్, సుశాంత్ గోల్డ్‌మెడల్ సాధించగా దేవలాస్యప్రియ సిల్వర్, కటాస్ విభాగంలో స్తంభం నిత్య గోల్డ్ మెడల్, కానుక వికంచి సిల్వర్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

మల్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సిరిసిల్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని, పతకాలు సాధించి, సత్తాచాటారు. పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని కె.సంజన సీనియర్స్ కటాప్ విభాగంలో గోల్డ్‌మెడల్, 7వ తరగతి విద్యార్థులు జి.నిత్య, కె.చంద్రకళ కాంస్యం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం నీర్ల నీరజ, పీఈటీ ఆంజనేయులు, టీచర్లు అభినందించారు.

కరాటేలో భీంరాజ్‌పల్లి విద్యార్థికి గోల్డ్‌మెడల్

గొల్లపల్లి: సిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన సింగారపు రాంచరణ్, టీం కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గాంగేయ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లేశం, కరాటే మాస్టర్ చిరంజీవి, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

కాకతీయ కాలువలో పడిన వ్యక్తి.. నీటి నిలిపివేత

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను సోమవారం సాయంత్రం నిలిపివేసారు. కాలువలో ఓ వ్యక్తి జారి పడిపోయాడు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో, అధికారుల ఆదేశాల మేరకు నీటిని నిలిపివేశారు.

ప్రభురాయ స్వామి జాతర మహోత్సవం

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెంలో ప్రభురాయ స్వామి జాతర మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ఏనుగు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మాదం వినోద్, అంగడి ఆనంద్, గడ్డం జలందర్ రెడ్డి, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమావేశం

జగిత్యాలరూరల్: యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ, ప్యాక్స్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగిందో ప్రస్తుత యాసంగి సీజన్ కూడా సక్రమంగా జరిగేలా పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్, ప్యాక్స్ సీఈవో సురేశ్, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకనక సోమేశ్వరుడికి డీఎస్పీ పూజలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర ఆలయాన్ని సోమవారం డీఎస్పీ జయరాం, కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బల్యాపెల్లి ప్రభాకర్‌శర్మ, ఆలయ కమిటీ బృందం స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదంతో పాటు స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్‌ను సస్పెండ్ చేయాలి

మెట్‌పల్లి: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్‌ను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. మెట్‌పల్లి సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని, సమస్యలపై ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలనికోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్, నాయకులు ఖాజా అజీం, రైసుద్దీన్, బర్ల వంశీ, తహసీన్, షాహేశ్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

జగిత్యాల:ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని మాతాశిశు సంరక్షణాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత లేని వైద్యులను నియమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆరోగ్య విద్య బోధకులు భూమేశ్వర్, శంకర్, ఆరోగ్య విస్తరణాధికారి రాజేశం, శ్యామ్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఊరేగింపు

రాయికల్: పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న సర్వాయి పాపన్న విగ్రహాన్ని సోమవారం శివాజీ విగ్రహం నుంచి గౌడ సంఘం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలుగందుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, కోశాధికారి బండి ప్రవీణ్ పాల్గొన్నారు.

దుబ్బరాజన్న జాతరకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు

సారంగాపూర్: మహాశివరాత్రి సందర్భంగా దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ సింధు శర్మ అన్నారు. దుబ్బరాజన్న ఆలయానికి సరఫరా చేసే విద్యుత్ లైన్లతో పాటు, సారంగాపూర్ మండలానికి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్లను సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఆయన వెంట ఏఈ ప్రవీణ్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మేడిపల్లి పోలీసులు సోమవారం సైబర్ క్రైమ్ నేరాలపై, ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్‌కు వచ్చే లింకులు, మెసేజ్ ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ఎంతో అవగాహన ఉండాలని, అలా మోసపోతే వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

శివరాత్రి ఉత్సవాలకు విప్‌కు ఆహ్వానం



ప్రభుత్వ విప్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి నిర్వహించే శివరాత్రి ఉత్సవాలు, 26న శివరాత్రి రోజున శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరు కావాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నంచర్ల సొసైటీ చైర్మన్ వేణుగోపాల్, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రామచంద్రం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్

ధర్మపురి: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నక్కలపేటలో సోమవారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. సేవాలాల్ దేవాలయం నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన తండా వాసులు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కథలాపూర్:మండలంలోని చింతకుంటకు చెందిన మంతెన ప్రవీణ్ (17) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రవీణ్ కొన్ని నెలలుగా బంధువుల గ్రామంలో ఉంటున్నాడు. ఇటీవల చింతకుంటకు వచ్చాడు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కుటుంబసభ్యులు చెప్పడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అంటున్నారు. ప్రవీణ్ మృతిపై అనుమానం ఉందని మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడకు చెందిన రామకృష్ణ(23) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కొంతకాలంగా రామకృష్ణ మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఉదయం అతని తల్లి ఊరికి వెళ్లగా, తండ్రి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి అతడు ఉరి వేసుకొని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

జగిత్యాలటౌన్:జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో జగిత్యాల మహిళా కాంగ్రెస్ వివిధ విభాగాల బాధ్యులకు నియామకపత్రాలు అందించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిప్పరి అనిత, కోరుట్ల, మెట్‌పల్లి బాధ్యులు కవిత, హరిత తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం పక్కాగా పంపిణీ చేయాలి



యాప్‌ను పరిశీలిస్తున్న ఏసీడీపీవో, సూపర్‌వైజర్

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే సరుకులను ఫొటోను తీసి పోషణ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని మల్యాల ఐసీడీఎస్ ఏసీడీపీవో అరవింద అన్నారు. మండల కేంద్రంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సూపర్‌వైజర్ మహేశ్వరీతో కలిసి సందర్శించారు. కేంద్రాల్లోని రికార్డులు, సరుకుల నిల్వ, చిన్నారుల ఎత్తు, బరువులు తదితర వాటిని తనిఖీ చేశారు.

బీజేపీ నాయకుల ప్రచారం

రాయికల్: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయ కులు ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి అంజిరెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, సతీశ్, కుర్మ మల్లారెడ్డి, భూమేశ్, శేఖర్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థికి మద్దతు

కథలాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు.మండలంలోని పలు గ్రామాల్లో పట్టభద్రులను సోమవారం కలిసి హరికృష్ణకు మద్దతుగా ప్రచారం చేశారు. నిరుద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: మెదక్ జిల్లా చేగుంటలో విధులు నిర్వహించేందుకు వెళ్తున్న సీఆర్పీలు రమేశ్, శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారని, మెదక్ జిల్లాకు చెందిన సీఆర్పీఆస్పాన్ గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని సీఆర్పీలు కోరారు. మండలంలోని ఎమ్మార్సీ వద్ద సీఆర్పీలు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవీందర్, శివరాం, రాజేందర్, ఎంఐఎస్ కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: పట్టణంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న డా.రాజు ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక గాన స్వరాభిషేకం పోస్టర్‌ను సోమవారం ఆధ్యాత్మిక ప్రముఖులు ఆవిష్కరించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో 24 గంటల నిర్విరామ గాన స్వరాభిషేకం కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పర్యవేక్షకులు జవ్వాజి సందీప్‌కుమార్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పద్మాకర్, అయ్యప్ప స్వామి భజన మండలి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు నీలం దశరథరెడ్డి, ఉపాధ్యక్షుడు మార కైలాసం, పాత్రికేయులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

బుల్లెట్ సైలెన్సర్ తొలగింపు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలో భాగంగా ఇబ్రహీంపట్నంకు చెందిన ముక్కెర శ్రీకాంత్ అనే వ్యక్తి బుల్లెట్‌కు శబ్దం వచ్చే సైలెన్సర్‌ను అమర్చుకుని వస్తుండగా పట్టుకుని ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినందుకు బండి యొక్క సైలెన్సర్‌ను తీసివేయించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.